క్లుప్తంగా

అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం

● తల్లీబిడ్డ క్షేమం



శిశువును చూపుతున్న ఈఎంటీ రంగస్వామి

ఆలూరు రూరల్: ఓ గర్భిణి అంబులెన్స్‌లోనే పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. హొళగుంద మండలం నెరణికి గ్రామానికి చెందిన నిండు గర్భిణి లక్ష్మికి మంగళవారం మధ్యాహ్నం పురిటి నొప్పులు రావడంతో భర్త లక్ష్మన్న 108 ఫోన్ చేశాడు. ఆలూరు 108 అంబులెన్స్ నెరణికి గ్రామానికి చేరుకుని గర్భిణిని హొళగుంద ప్రైమరీ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువై ఆడ బిడ్డను ప్రసవించింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ రంగస్వామి తెలిపారు. హొళగుంద ఆస్పత్రిలో చేర్పించినట్లు చెప్పాడు.

రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ జయన్న

నందవరం : మండల పరిధిలోని ఇబ్రహీంపురం గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం పంచాయతీరాజ్ ఏఈ జయన్న పరిశీలించారు.బీసీ కాలనీ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం భాగంగా మంజూరైన రూ.20 లక్షలతో చేపట్టిన డ్రైనేజీలు, సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ డ్రైనేజీలు పూర్తయ్యాయని, సీసీ రోడ్లులో కాంక్రీట్ పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు సక్కరప్ప, పురుషోత్తంరెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు జ్ఞానేశ్వరి, ఉరుకుంద పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

చిప్పగిరి: ఇప్పటివరకు రైతు భరోసా సాయం అందని రైతులు ఎవరైనా ఉంటే ఈనెల చివరి లోపు ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని ఏఓ ఆనంద్ సూచించారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతుకు పెట్టుబడి సాయం కింద ఏటా మూడు విడతల్లో మొత్తం రూ.13,500 ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అర్హులైన ప్రతి రైతుకు సాయం తప్పక అందుతుందన్నారు.

ఉత్సాహంగా గిరక బండి పోటీలు



చెన్నంపల్లిలో గిరక బండి లాగుతున్న ఎద్దులు

తుగ్గలి: పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం సందర్భంగా మంగళవారం చెన్నంపల్లిలో నిర్వహించిన గిరకబండి పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీలను గ్రామానికి చెందిన లక్ష్మీనష్ల యర్స్ యజమాని గోపాల్‌రెడ్డి, మబ్బాషా ప్రారంభించారు. ఈ పోటీలలో విజేతలుగా డీలర్ శీనప్ప వృషభాలు, మేకల రంగడు, బడే సాబ్, మల్లికార్జున వృషభాలు నిలిచాయి. వృషభ విజేతల యాజమాన్యాలకు వరుసగా దాతలు వెంకటరంగయ్య, రూ.5వేలు, మేడా సుబ్బయ్య రూ.3వేలు, చంద్రమోహన్ రూ.2వేలు, చెన్నకేశవులు వెయ్యి అందజేశారు.

రైతు భరోసా కేంద్రాల తనిఖీ

వెల్దుర్తి: మండల పరిధిలోని గోవర్ధనగిరి రైతు భరోసా కేంద్రాలను(1, 2) మంగళవారం ఏఓ అక్బర్ బాష తనిఖీ చేశారు. రికార్డు, హాజరు పట్టిని పరిశీలించిన ఏఓ రైతులకు అందజేస్తున్న సేవలపై ఆరా తీశారు. ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి దుక్కులు దున్నుకుని వర్షాలు కురిసిన తరువాత పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఆ దిశగా రైతులకు అవగాహన కల్పించాలని ఆర్బీకేల సిబ్బందికి సూచించారు.

ఎల్లెల్సీ గట్టుపై చెత్త తొలగింపు

హొళగుంద: మండల కేంద్రం సమీపంలోని తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) వద్ద పారబోసిన చెత్తను సర్పంచ్ చలవాది రంగమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్య కార్మికులు తొలగించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (చెత్త సేకరణ కేంద్రాలు) షెడ్‌లు ఉన్నా గ్రామంలో సేకరించిన చెత్తను దిగువ కాలువ గట్టుపై పారబోయడంతో సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'ఎల్లెల్సీ గట్టు పైనే చెత్త డంపింగ్' కథనానికి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి స్పందించారు. సంబంధిత కార్మికులతో చెత్త తొలగింపు పనులు చేపట్టారు.

బస్సులు నడపండి

హొళగుంద: ఆదోని నుంచి హెబ్బటం మీదుగా పెద్దగోనెహాళ్, ఎండీ హళ్లి, ఇంగళదహాళ్‌కు ఆర్టీసీ బస్సులను నడపాలని సర్పంచ్‌ల సంఘం హొళగుంద మండల అధ్యక్షుడు పెద్దగోనెహాళ్ కొత్తింటి వెంకటరెడ్డి కోరారు. మంగళవారం ఆయా గ్రామాల సర్పంచ్‌లతో కలసి ఆర్టీసీ ఆదోని డిపో మేనేజర్ రఫిక్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థినులకు వరం... 'బనవాసి'

● నాణ్యమైన బోధనకు పెట్టింది పేరు బనవాసి ఏపీఆర్‌జేసీ
● ఈనెల 28వ తేదీ వరకు గడువు పొడగింపు
● ప్రవేశ పరీక్ష మే 25న
● నాలుగు జిల్లాల విద్యార్థినులకు అవకాశం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీ క్రమశిక్షణకు, నాణ్యమైన విద్యాబోధనకు పెట్టింది పేరు. కాలేజీలో సీటు రావడం విద్యార్థినులు అదృష్టంగా భావిస్తారు, ఏపీ గురుకుల కాలేజీలో చదువుకున్న విద్యార్థినులు ఉన్నత విద్యలో రాణిస్తారనే నమ్మకం మెండు. పేద విద్యార్థినులకు వరం లాంటిది బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీ. రాయలసీమ జిల్లాలైన కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల విద్యార్థినులకు ఇక్కడ రెండు సంవత్సరాలు విద్యాబోధన అందిస్తారు. ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు సాధిస్తే సీటు వచ్చినట్లే. కాలేజీ ప్రవేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, క్రీడాకారులు, అనాథలు, ఎన్‌సీసీ క్యాడెట్లకు రిజర్వేషన్ కల్పిస్తారు. కాలేజీలో సీటు వచ్చిన విద్యార్థినులకు రెండు సంవత్సరాలు విద్యాబోధనతో పాటు హాస్టల్ వసతి కల్పిస్తారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు

ఇంటర్మీడియట్ ప్రవేశానికి పదవ తరగతి చదివిన విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.



బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీ

ప్రవేశ పరీక్షకు రూ. 100 చెల్లించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు https//aprs.apcfss.in వెబ్ సైట్‌లో లభిస్తాయి.

పదవి తరగతి పాఠ్యాంశాల నుంచే ప్రశ్నలు..

ప్రవేశ పరీక్షలు మంచి ర్యాంకు సాధించి సీటు సాధించాలి అంటే విద్యార్థినులు చూసుకోవాల్సిన అంశాలపై అప్రమత్తంగా ఉండాలి. పదవ తరగతి పాఠ్యాంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. గణితంలో 50, సైన్సులో 50, ఇంగ్లిష్‌లో 50 ప్రశ్నలు ప్రవేశ పరీక్షలో ఇస్తారు. పట్టుదలతో చదివితే ర్యాంకు సులభంగా సాధించవచ్చు.

కాలేజీలో ఉండే సీట్లు

● బన వాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీలో బాలికలకు ఎంపీసీలో 60 సీటు, బైపీసీలో 40 సీట్లు, ఎంఈసీలో 30 సీట్లు ఉంటాయి.
● అనంతపురం జిల్లా కొడిగినహళ్లిలో బాలురకు ఎంఈసీ,ఎంపీసీ,సీఈసీ,బైపీసీ కోర్సులుఉంటాయి.
● చిత్తూర్ జిల్లాలో గారేంపల్లిలో బాలురకు బైపీసీ, సీఈసీ, ఎంపీసీ, ఎంఈసీ కోర్సులు ఉంటాయి.

దరఖాస్తు ... ప్రవేశ పరీక్ష తేదీలు

కాలేజీలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష కోసం ఈనెల 28వ తేదిలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకు 12.5.2023న హాల్ టికెట్స్ అందజేస్తారు. ప్రవేశ పరీక్ష 20.5.2023న (మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల) వరకు ఉంటుంది. ప్రవేశ పరీక్ష ఫలితాలను 8.6.2023న విడదల చేస్తారు. ర్యాంక్ సాధించిన విద్యార్థినులకు కౌన్సెలింగ్ 15.6.2023న నిర్వహిస్తారు.

బాలికల మంచి అవకాశం



రాయలసీమలోని నాలుగు జిల్లా విద్యార్థినులకు ఇదో మంచి అవకాశం. కాలేజీలో సీటు వస్తే రెండు సంవత్సరాలు బోధన అందిస్తాం. ప్రవేశ పరీక్షలో వచ్చిన ర్యాంకుల ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఆన్‌లైన్‌లో ఈ నెల 28 తేదీ వరకు గడువు పొడగించారు. కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూర్ జిల్లాలకు చెందిన బాలికల మాత్రమే ప్రవేశం ఉంటుంది. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డా. జయం శ్రీనివాసగుప్త, ప్రిన్సిపాల్ ఏజీఆర్‌జేసీ బనవాసి.

వైభవంగా వెంకన్న రథోత్సవం

పత్తికొండ రూరల్ : పత్తికొండలో శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఆలయంలో ఉదయం 10.30గంటలకు స్వామివారి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. సాయంత్రం 5గంటలకు గుత్తి రోడ్డు కూడలిలో ఉత్సవ మూర్తులను రథంపై ఉంచి ప్రత్యేక పూజలు జరిపించారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, గొరవయ్యల సంప్రదాయ నృత్యాల నడుమ యువత కేరింతలు కొడుతూ సందడి చేశారు. రావణాసురుడు, అమ్మవారు, రాక్షసి, జోకర్ బొమ్మల వేషధారణలు చిన్నారులను ఆకట్టుకున్నాయి. భక్తజన సందోహం మధ్యన స్వామివారి రథాన్ని భక్తులు లాగారు.



రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తజనం

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

వెల్దుర్తి: పొదుపు మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని, కిచెన్ గార్డెన్‌కు ప్రాముఖ్యత ఇవ్వాలని తద్వారా ఆరోగ్యకరమైన ఆహారం, ఆర్థికాభివృద్ధి, పర్యావరణ రక్షణ సాధ్యమవుతుందని ప్రకృతి వ్యవసాయ శాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (డీపీఎం) చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బోయనపల్లె, బుక్కాపురం గ్రామాలలో ప్రకృతి వ్యవసాయం పేరుతో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జరిగిన ర్యాలీ, అవగాహన కార్యక్రమాలలో పాల్గొన్న డీపీఎం చంద్రశేఖర్ పొదుపు మహిళలకు ప్రయోగాత్మకంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను, ద్రవ జీవామృతం తయారీని వివరించారు. అనంతరం వారితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంలో గోమూత్రం, గోపేడ, వేపాకు తదితర స్థానిక వనరులతో జీవామృతం, బీజామృతం, నీమాస్త్రం, అగ్నిస్త్రం, బ్రహ్మాస్త్రం, పంచగవ్య తదితర మేలైన ఎరువులు, మందులను తయారుచేసుకునే విధానాన్ని తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది బుజేశ్వరుడు, మల్లికార్జున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఎం చంద్రశేఖర్

విద్యార్థులకు అద్దాలు పంపిణీ

కృష్ణగిరి: ప్రభుత్వం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా వృద్ధులు, విద్యార్థులకు వెలుగును ఇస్తుందని డీబీసీఎస్ డీపీఓ, ఆప్తాలమిక్ ఆఫీసర్ డాక్టర్ భరత్, పరమేశ్వరరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కంబాలపాడు గ్రామంలోని డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం వారు విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు.

కూలీల సంఖ్య పెంచాలి

ఆస్పరి: ఉపాధి పనులకు కూలీల సంఖ్య పెంచాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ అమర్నాథ్‌రెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మంగళవారం మండలంలోని బిల్లేకల్లు, అట్టెకల్లు, పుటకలమర్రి, పలకూరబండ గ్రామాల్లో జరగురుతున్న ఉపాధి పనులను పరిశీలించి మస్టర్లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా పీడీ కూలీలతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రూ.272 తగ్గకుండా పనులు చేసుకోవాలన్నారు. మండలంలో ప్రస్తుతం 5,400 మంది కూలీలు హాజరవుతున్నారని, ఇది 8 వేల మందికి పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈయన వెంట డీపీఓ సిద్ధలింగమూర్తి, ఈసీ నాగముని కుమార్ ఉన్నారు.



బిల్లేకల్లు పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ అమర్నాథ్‌రెడ్డి

సూక్ష్మ సేద్యంపై రైతులకు అవగాహన కల్పించండి

ఆలూరు రూరల్: సూక్ష్మ సేద్యంపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా సూక్ష్మ సాగునీటి పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ రాధాకృష్ణా రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని హార్టికల్చర్ సిబ్బందితో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2023-24 ఏడాదికి జిల్లాలో 5 వేల హెక్టార్లకు డ్రిప్ పరికరాలు అందించేందుకు లక్ష్యాన్ని నిర్దేశించామన్నారు. బోరు, నీటి కుంట ఉన్న ప్రతి రైతుకు ఈ పథకాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ఆర్బీకేల హార్టికల్చర్ సిబ్బందిపై ఉందన్నారు. 5 ఎకరాలలోపు సాగు భూమి ఉన్న రైతుకు 90 శాతం రాయితీ, 10 ఎకరాల లోపు ఉన్న రైతుకు 70 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు సరఫరా చేస్తామన్నారు. అలాగే 5 ఎకరాలపై ఉన్న రైతుకు 55 శాతం, 12 ఎకరాల లోపు సాగు భూమి ఉన్న రైతుకు 70 శాతం రాయితీతో స్ప్రింక్లర్లు అందజేస్తామన్నారు. అర్హులైన రైతులు ఆధార్ కార్డు, పట్టాదార్ పాసు పుస్తకం, అడంగల్, రైతు బ్యాంకు పుస్తకం తదితర వివరాలతో ఆర్బీకేల్లో సంప్రదించాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఏడీఏ సునీత, హార్టికల్చర్ అధికారిణి ఇందిర, ఆలూరు ఏఓ వెంకటేశ్వర గౌడ్ డ్రిప్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీడీ రాధాకృష్ణా రెడ్డి

కుతంత్రాలకు పుట్టినిల్లు టీడీపీ

● మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: కుట్రలు, కుతంత్రాలకు తెలుగుదేశం పార్టీ పుట్టినిల్లు అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఎద్దేవా చేశారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన టీడీపీ నాయకులు పనికట్టుకుని అసత్యారోపణలు చేస్తున్నారని, ఉనికిని కాపాడుకునేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నిరంతరం బురదజల్లుతున్నారని విమర్శించారు. చిప్పగిరి మండలం గుమ్మనూరు గ్రామంలో జరుగుతున్న శ్రీ బస్వేశ్వరస్వామి ఉత్సవాల సందర్భంగా మంగళవారం గంగమ్మ పూజా కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని గుర్తు చేశారు. అయితే ఓర్వలేని టీడీపీ నాయకులు పసలేని, అసత్యారోపణలు చేస్తున్నారని, ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని హెచ్చరించారు. ప్రత్యేకించి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అర్థరహితంగా మాట్లాడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారన్నారు. తనతండ్రి చంద్రబాబు చేసిన అభివృద్ధిని వివరించకుండా వైఎస్సార్‌సీపీని విమర్శించేందుకే వచ్చామన్నట్లుగా లోకేష్ తీరు ఉందని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేలకు వివిధ రకాలుగా పేర్లు పెట్టి పిలువడం లోకేష్ మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. ప్రజల వద్దకు నేరుగా ఎమ్మెల్యేలు, మంత్రులు వెళ్తున్న ప్రభుత్వం మాదని, ప్రజలతో నేరుగా మమేకమవుతూ సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామనే విషయాన్ని టీడీపీ నాయకులు మరిచిపోయినట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ పాలనలో ఎప్పుడైనా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారా అని ప్రశ్నించారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు ఉన్న తేడా ప్రజలకు తెలుసని, ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రయోజనం లేదనే విషయాన్ని లోకేష్ గుర్తించుకుంటే బాగుంటుందని సూచించారు. కార్యక్రమంలో దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మెన్ శ్రీ నివాసులు, గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి, మండల కన్వీనర్ నారాయణ, మంత్రి తల్లిదండ్రులు బసప్ప, మాజీ సర్పంచ్ శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.



గుమ్మనూరు గ్రామంలో గంగమ్మ పూజలో పాల్గొన్న మంత్రి జయరాం

మలేరియా నివారణకు కృషి చేద్దాం

కృష్ణగిరి: మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి మహేశ్వర ప్రసాద్ సూచించారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన వైద్య సిబ్బందితో కలిసి కృష్ణగిరిలో ర్యాలీ నిర్వహించారు. మురుగు నీటిలో వృద్ధి చెందే ఆడ అనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల మలేరియా సోకుతుందన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు దోమ తెరలు వాడాలని సూచించారు.

– మద్దికెర: మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ మాట్లాడుతూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా ఉండాలంటే ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

– ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి పీహెచ్‌సీలో మలేరియా నివారణ దినోత్సవం నిర్వహించారు. వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రకళ, వెంకటేశ్వర్లు, స్టాఫ్ నర్సులు రమాదేవి, రేణుకా, మంగమ్మ పాల్గొన్నారు.



కృష్ణగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా నారాయణ

ఆలూరు/చిప్పగిరి: ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా గుమ్మనూరు నారాయణను ప్రభుత్వం నియమించింది. మంగళవారం నియామక ఉత్తర్వులను మంత్రి గుమ్మనూరు జయరాం చేతుల మీదుగా నారాయణ అందుకున్నారు. కార్యక్రమంలో ఆలూరు మార్కెట్ యార్డ్ సెక్రటరీ శాంతకుమార్ ఉన్నారు.



మంత్రితో ఉత్తర్వులు అందుకుంటున్న నారాయణ

పంచాయతీ అభివృద్ధికి కృషి

ఆలూరు రూరల్: మేజర్ పంచాయతీ అభివృద్ధికి వార్డు సభ్యులు కృషి చేయాలని ఆలూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ అరుణదేవి సూచించారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈఓ కృష్ణ కుమార్‌తో కలిసి వార్డు సభ్యులతో సమావేశమయ్యారు. ఈ నెల 1న నిర్వహించిన మార్కెట్ వేలాలను ఆమోదించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ సంత మార్కెట్ అభివృద్ధికి, తాగునీటి సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించామన్నారు.

ఏపీఆర్‌జేసీ దరఖాస్తు గడువు పెంపు

పత్తికొండ టౌన్: ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు ఈనెల 28 వరకు పొడగించినట్లు పత్తికొండ ఏపీఆర్ బాయ్స్ స్కూల్/కాలేజ్ ప్రిన్సిపాల్ ఓఎస్ శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఏపీఆర్ స్కూల్స్‌లో 5,6,7,8 తరగతులకు, ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్‌డీసీలలో జూనియర్ ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఆర్ఎస్-క్యాట్-2023, ఏపీఆర్‌జేసీ-డీసీ-సెట్‌ల దరఖాస్తు స్వీకరణ మరో నాలుగు రోజులు పెంచారన్నారు.

లేగదూడల పెంపకంపై దృష్టి సారించాలి

నందవరం: పాడిరైతులు లేగ దూడల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని నందవరం పశువైద్యాధికారి నరేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. మండలంలోని పూలచింత సచివాలయంలో పాడిరైతులకు పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో భాగంగా వెటర్నరీ అసిస్టెంట్లు పశు సంరక్షణ, పెంపకంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో పశువులకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చల్లని నీడ ప్రదేశాలలో పశువులను ఉంచాలన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు రాజ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ వీరేంద్ర, వీఏఏ రామమూర్తి, వీఆర్వో రాఘవేంద్ర పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న నరేంద్రనాథ్‌రెడ్డి

ఎస్‌డీజీ సర్వే వేగవంతం చేయాలి

నందవరం : గ్రామాల్లో చేపట్టిన సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి, గణాంకాధికారి వెంకటేశ్వర్లు, మహిళ పోలీసులకు, సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రం నందవరం పోలీస్‌స్టేషన్‌లో మహిళ పోలీసులతో ఎస్‌డీజీ సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 0 నుంచి 5 ఏళ్ల చిన్నారులు 4,187 మంది గాను 1,598 మంది మాత్రమే ఆధార్ నమోదు జరిగిందన్నారు. ఈ సర్వే 38.17 శాతం మాత్రమే పూర్తయిందన్నారు. సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సర్వే 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. సర్వేను జిల్లా కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారని, త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేష్‌కుమార్, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గణాంకాధికారి వెంకటేశ్వర్లు

'గడప గడప'కు సంక్షేమ పథకాలు

● పేదల అభివృద్ధే జగనన్న ప్రభుత్వ లక్ష్యం
● ప్రతి ఇంటింటికీ సంక్షేమ పథకాలు
● ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి: తెలుగుదేశం పాలనలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికి పథకాలు అందేవని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలు, కులమతాలకతీతంగా సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మండలంలోని తొగర్చేడు గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా చెన్నకేశవస్వామి దేవాలయంలో పూజలు చేశారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. అదేవిధంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పక్షపాత వైఖరి లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాలను మీ ఇంటికే అందిస్తున్నామన్నారు. మీ దయతోనే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, మీకు సేవ చేయడమే తమ లక్ష్యమన్నారు. తనతోపాటు మండలస్థాయి అధికారులందరు తన వెంట వస్తున్నారని, ఏవైనా సమస్యలుంటే తెలపాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్నా పథకాల్లో ప్రతి కుటుంబానికి ఏదో ఒక లబ్ధి చేకూరుతోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగనన్న ప్రజలకు చెప్పినవి, చెప్పనివి కూడా అమలు చేయడంతో గడప గడపలో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. అర్హత ఉంటే పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, ప్రజల్లో ధైర్యంగా వేస్తుకునేలా పాలనా జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతోపాటు అగ్రవర్ణాల్లో పేదలకు కూడా ఆరోగ్యశ్రీ, అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన, వైఎస్సార్ ఆసరా, భరోసా లాంటి పథకాలతో పేదల జీవితాల్లో మార్పు వచ్చి సంతోషంగా ఉంటున్నారన్నారు. గ్రామంలో సీసీ రహదారులు లేక నిత్యం బురదలో తిరుగుతున్నామని, కొన్ని కాలనీల్లో నీటి సమస్య ఉందని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పీఆర్ ఏఈ అబ్దుల్‌వహీద్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు అందించే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. అనంతరం మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. రెండు రోజులుగా పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ప్రజలు తమ దృష్టికి తీసుకవచ్చిన ప్రతి సమస్యను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కేశ సుభాషిణి, వైస్ ఎంపీపీ బోయ సుశీల, సొసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, నాయకులు లాయర్ నరేంద్రనాథ్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, రామచంద్రుడు, దస్తగిరి, ఎంపీడీఓ మోహన్‌కుమార్, తహసీల్దార్ పురుషోత్తం, ఏఓ వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ అబ్దుల్‌వహీద్, ఏపీఎం దానన్న, ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి, ఏపీఓ అబ్దుల్‌షుకూర్ పాల్గొన్నారు.



తొగర్చేడు గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పాఠశాలలు బలోపేతం

తుగ్గలి : సామాజిక తనిఖీలతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమవుతాయని ఇన్‌చార్జ్ ఎంఈఓ రామవెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మెయిన్ స్కూల్‌లో మంగళవారం హెచ్‌ఎంలకు సామాజిక తనిఖీలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలల్లో వసతుల కల్పన, ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల భద్రత, ఎండీఎం అమలు తీరు తదితర అంశాలను సామాజిక తనిఖీ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

హొళగుంద: గ్రామాల్లో ఇంటింటికి రేషన్ పంపిణీని సక్రమంగా జరిగేలా చూడాలని తహసీల్దారు హుసేన్‌సాహెబ్ డీలర్లకు సూచించారు. మంగళవారం ఆయన ఆర్ఐ దినేష్ రాజశేఖరన్‌తో కలిసి డీలర్లతో సమావేశమయ్యారు. ట్రక్కు డ్రైవర్లు, డీలర్లు సమన్వయంతో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరుకులు అందించాలని తహసీల్దార్ సూచించారు. ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అధికారుల చొరవతో సమస్య పరిష్కారం

గోనెగండ్ల: మండల పరిధిలోని బీ. అగ్రహారం గ్రామంలో నెలకొన్న శ్మశాన వాటిక స్థలం కోసం జరిగిన వివాదం అధికారుల చొరవతో మంగళవారం పరిష్కారం అయింది. బీ. అగ్రహారం గ్రామానికి చెందిన బోయ మారెమ్మ సోమవారం ఉదయం మృతి చెందింది. ఇరువర్గాల పోరుతో ఆమె దహన సంస్కారాలు సోమవారం నిలిచి పోయాయి. వివాదం కారణంగా బోయ మారెమ్మ కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం రాత్రి ఎమ్మిగనూరు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. మంగళవారం ఉదయం కూడా శవంతో ధర్నా చేశారు. దీంతో ఎమ్మిగనూరు రూరల్ సీఐ మోహన్ రెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్ఐ తిమ్మారెడ్డి అగ్రహారం గ్రామానికి చేరుకొని గ్రామ పెద్దలతో చర్చలు జరిపి గ్రామంలో 244 సర్వే నంబర్‌లో దహన సంస్కారాలు చేసేందుకు ఏర్పాటు చేశారు.



శ్మశాన వాటికకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు